# మాతృక

★

శ్రీ రంగధామ్

మనోరమను కలుసుకోవాలనీ, ఆమెతో మాట్లాడాలనీ, ఆమె యెడల నాకుగల సానుభూతిని తెలియబర్చాలనీ, నాకు చిరకాలంగా ఉన్న ఒక తీరని వాంఛ. ఆమెయందు నాకు కలిగిన ప్రీతి మరే వ్యక్తియందూ ఏనాడూ కలుగలేదు. ఆమె విశాలమైన వదనంలో, ప్రేమార్ద్రితతో నిండిన నల్లని సోగదేలిన కళ్ళూ, చిన్న చిరునవ్వును తాండవింపజేసే ఆమె నోరూ, ఆమె సుందర ముఖంలో ఎత్తయిన నుదుటిని ప్రస్ఫుటంచేసే తలకట్టూ, సుదీర్ఘమైన ఆమె వేణీ నన్ను వదలకుండా ఎన్నాళ్ళో వెంటాడాయి. కలల్లోనూ, భావనలోనూ ఆమె, ఆమె మాటలూ నన్నావరించాయి.

వర్షఋతువు వచ్చినప్పుడు ఆకాశంలో మేఘాలు వడిగా పరుగెడ్తూంటే, ఆ మేఘాలను తీవ్రంగా చూస్తూ మనస్సు భావనా లోకంలోకి ఎగిరిపోయినప్పుడు, ఆ మేఘాలమధ్య మనోరమను చూస్తుండేవాడిని. ఆమె మాటలూ, ఆ మాటలలోని ఒక సూక్ష్మమైన సరళతా, నా మెదడులో ప్రతిధ్వనించేవి. ఆమె తెలివితేటలూ, అందం, మంచితనం, త్యాగబుద్ధీ, సౌశీల్యం, ఆఖరికి ఆవిడలో కల బలహీనతా, అన్నీ నా మనస్సుకు హత్తుకుపోయాయి. నేనెప్పుడైనా మంచిపని చేస్తే, ఆ మంచి పనిని ఆమె తెలుసుకుని మెచ్చుకుంటే ఎంతో బాగుండు ననిపించేది. నేనేదైనా పొరపాటు చేస్తే అది నా బలహీనతగా భావించుకొని, దానిని ఆమె బలహీనతతో పోల్చుకుని, అటువంటి బలహీనతలు కూడా ఒక ఉత్తమ ఆదర్శానికి చెందినవే అని నన్ను నేను సమర్థించుకునేవాణ్ణి. ఆమెను గురించి నాకు తెలిసినంత బాగా మరెవరికీ తెలియదనుకునేవాణ్ణి. ఏదైనా కొత్త ఊరు వెళ్లినా, కొత్త మొహాల్ని చూసినా, ఆమెయొక్క పోలిక లెవరిలోనైనా కన్పిస్తే, ఆమేనేమో ? నని భ్రమపడేవాణ్ణి.. ఆ వ్యక్తిని కలుసుకోవాలనీ, మాట్లాడాలనీ అనిపించేది. తీరా అటువంటి ప్రయత్నమేదైనా చెయ్యబోయేముందు, వాళ్ల మాటల్లోనో, చేతల్లోనో ఏదో ఒక అసహజత్వం చూసి, ఆ వ్యక్తి నా మనోరమ కాదని గ్రహించేవాణ్ణి.

ఆశకు ఎంత బలం ఉందో నాలాంటి భావుకుడి భ్రాంతి వల్ల తెలుస్తుంది. నేను మనోరమను ఎప్పటికీ కలుసుకోలేనని నాకు తెలుసు. అయినా ఇంకా ఆశే ! ఇంకా భ్రమే ! నేను నశించచ్చు, నా తరువాత తరంవారు, వారి తర్వాత తరాలూ నశించచ్చు. కాని మనోరమ చిరకాలం వర్ధిల్లుతుంది ! నాలాటి భావుకుల్ని అలా ఆవేశించి, ఆక్రోశింప చేస్తుంది. లేదా నాలాటి యాత్రికులకు కల్లోల జీవిత సముద్రంలో మంచితనానికీ, త్యాగానికీ త్రోవచూపే ధృవతారలా నిలుస్తుంది—సాహిత్యాకాశంలో !

ఎందుకంటే ఆమె, ఒక పాత్ర ! 'కరుణ' అనే నవలలోని నాయిక ! ఆ నవలను 'సత్యశ్రీ' గారు రచించారు. ఆ నవల చదివి చదివి నా మనసులో ఆ పాత్ర రూపం హత్తుకుపోయింది. ఆమెకోసం ఎంతో బాధపడ్డాను, ఎంతో పరితపించాను, కాని నా జీవితంలో నేనామెను కలుసుకోలేనని నాకు తెలుసు—నవలల్లోని పాత్రలకు మాటలతో జీవంపోసే రచయితలకు, ప్రత్యక్షంగా వారిని రక్తమాంసాలతో పాఠకుల ముందుంచగల శక్తి కలిగితే తప్ప ?

ఇంతటి అసంభవమైన కోరిక సుమారు పదేళ్ళ నన్ను బాధించింది. నాకు పదిహేడేళ్ల వయస్సప్పుడు మొట్టమొదటిసారి 'కరుణ' అనే నవల చదివాను. అది సుమారు మూడు వందల పేజీల నవల. ఒక సాయంకాలం ప్రారంభించి, తెల్లవారులూ కూచుని చదివి, మర్నాడు పొద్దున పది గంటలకు పూర్తి చేశాను. ఆ రోజుల్లా నేను ఆ నవల గురించీ, మనోరమ పాత్ర గురించీ ఆలోచిస్తూ పరధ్యానంగానే ఉన్నాను. ఆ పాత్ర నన్నెంత బలంగా ఆకర్షించిందంటే, చివరకు అది, ఒక నవలలోని పాత్ర అనే విషయం మర్చిపోయి, ఆమె ఒక ప్రత్యక్షమైన, పరిచితమైన వ్యక్తి అయినట్లు భావించుకోసాగాను. కాలం గడిచినకొద్దీ ఆ భావన బలపడడమే కాకుండా ఆ భావనకు మరికొన్ని ఆలోచనలు తోడయ్యాయి.

అసలు మనోరమ వంటి వ్యక్తి ఎందు కుండగూడదూ ? ఆమెలో చాలా సహజత్వం ఉంది. ఆ పాత్రలో అంత సహజత్వాన్ని చొప్పించగలగడానికి రచయిత, అటువంటి వ్యక్తిని చాలా సన్నిహితంగా ఎరిగిఉండాలి. ఆ వ్యక్తి బహుశా

రచయితకు దగ్గర బంధువు కావచ్చు, స్నేహితురాలు కావచ్చు; లేకపోతే రహస్య ప్రేయసి కావచ్చు. ఏమైనా ఆ వ్యక్తితో రచయితకు గాఢమైన పరిచయం ఉండితీరాల్సిందే. అసలు ఆ వ్యక్తిని రచయిత ఎంతగానో ఆరాధించి ఉంటాడు. లేకపోతే అంత శక్తివంతంగా, సజీవంగా ఆ పాత్రను సృష్టించలేడు. కాబట్టి మనోరమ ఎవరో తెలుసుకోవాలన్నా, ఆమెను కలుసుకోవాలన్నా ఒకే ఒక మార్గం నాకు స్ఫురించింది. అదేమిటంటే, ఆమెను గురించి ఆ రచయితను సూటిగా అడగడమేనూ. బహుశా అది నే ననుకున్నంత తేలిక వ్యవహారము కాకపోవచ్చు, గాని అంతకన్నా నాకు వేరే గత్యంతరం తోచలేదు.

మా ఊరిలో 'సత్యశ్రీ' గారిని బాగా ఎరిగిన ఒక స్నేహితు డుంటే ఆయన వద్దకు వెళ్ళి, నాకు 'సత్యశ్రీ' గారిని కలుసుకోవాలని కోరికగా ఉందని చెప్పాను. ఆయన ఒక లాయరు. 'ఎందుకూ ?' 'ఏం కావాలి ?' అన్న ప్రశ్నలు వేస్తాడేమో నని భయపడ్డాను. ఆయన అటువంటి ప్రశ్నలు వేస్తే అసలు విషయం చెప్పడం చాలా కష్టం. ఇది భావనా ప్రపంచంతో సంబంధించిన విషయం. వాస్తవిక ప్రపంచంలో చాలా అసందర్భంగా కన్పించే విషయం. ఎలా చెప్పగలను ? కానీ, ఆయన అటువంటి ప్రశ్నలేమీ వెయ్యలేదు. ఆరాత్రే సత్యశ్రీగారు వస్తున్నారనీ, రాత్రి వచ్చి నేను ఆయనను కలుసుకోవచ్చుననీ చెప్పారు. నాకు చాలా ఆనందం కలిగింది.

ఆ రాత్రి ఆయ నింటికి మళ్ళీ వెళ్లాను. లాయరుగారు నన్ను తమ మేడమీదకు తీసికెళ్లి గదిలో ఇద్దరు వ్యక్తులతో సంభాషిస్తూ కూర్చున్న, ఒక సన్నని మధ్య వయస్కుడైన వ్యక్తికి పరిచయం చేశారు. ఆ యిద్దరు వ్యక్తులూ యువకులు. వారి చేతిలో ఏవో పుస్తకా లున్నాయి. సత్యశ్రీగారు నన్ను చూసి చిరునవ్వు నవ్వి నమస్కరించారు. ఆయన పంచె కట్టుకుని, దానిమీద చొక్కా వేసుకున్నారు. తల కొద్దిగా నెరిసింది. కోల మొహం, చామనచాయ ఆయనిది. ఆ మొహంలో నాకేమీ ప్రత్యేకత కన్పించలేదు. ముక్కు కొద్దిగా పెద్దది. నుదురు సామాన్యంగా ఉంది. ఆయన్ను చూడగానే, అంత వరకు నా మనస్సులో ఆయన ఆకారం ఫలానావిధంగా ఉంటుం దని ఊహించుకున్న ఊహంతా పటాపంచ లయిపోయింది. ఆయన పుస్తకం చదివినప్పుడు ఎంతో సన్నిహితంగా కన్పించే ఆయన ప్రత్యక్షంగా చూస్తుంటే పూర్తిగా కొత్త, అపరిచిత వ్యక్తిలా తోచారు.

ఎలా మాట్లాడడమో, ఆయనతో ఏం మాట్లాడడమో నాకు తోచలేదు. కానీ ఆయనే సంభాషణకు దారి తీశారు. కొద్ది నిముషాలు పరస్పర పరిచయాలు అయ్యాక, ఆయనతో మాట్లాడడం అంత కష్టం మనిపించలేదు. నేను వచ్చేసరికి ఉన్న ఇద్దరు వ్యక్తులూ కొద్ది సేపటిలో వెళ్లిపోయారు. నేనూ, లాయరుగారూ, సత్యశ్రీగారూ మిగిలాం.

అది విశాలమైన గది. పైన మధ్యగా ఒక ఎలక్ట్రిక్ లైటూ వెలుగుతోంది. రెండు పెద్ద బట్టల బీరువాలూ, రెండు పెద్ద సోఫాలూ, ఒక మంచం, నాలుగు గోడ్రెజ్ కుర్చీలూ ఉన్నాయి. గోడలకు రెండు వైపులా రెండు నిలువుటద్దాలున్నాయి. నేనూ, లాయరుగారూ ఒక సోఫామీద కూర్చున్నాం. మా కెదురుగా సోఫాలో సత్యశ్రీగారు కూర్చున్నారు. టీపాయ్ మీదున్న ఆష్ ట్రేలో సగం కాలిన సిగరెట్టుంది.

గోడలమీద నాలుగైదు మంచి పటా లున్నాయి. అప్పుడప్పుడు వాటివైపు చూస్తూ కాలం గడపసాగాను. నాకెదురుగా ఉన్న చిత్రం తథాగతుడిది. ఆయన చూపులో ఉన్న గాంభీర్యం నన్నెంతో ఆకర్షించింది. కొన్ని చిత్రాలలో ఆయన కండ్లు మూసి ధ్యానిస్తున్న ట్లుంటుంది; కానీ, ఆయన కళ్లు తెరవబడి ఉన్నప్పుడే ఎక్కువ ప్రశాంతత స్ఫురిస్తుంది, నాకు.

మా సంభాషణ, సాహిత్యం మీదకు మళ్లగానే, నేను ఆయనను 'కరుణ' నవల గురించి చాలా అభినందించాను. ఆ నవలలో నాకు మనోరమ పాత్ర చాలా నచ్చిందని చెప్పాను. ఆయన చిరునవ్వు నవ్వారు.

నా మనస్సులోని భావం నే ననుకోకుండా నా మాటల్లో బయటికి వచ్చేసింది. ''అసలు మనోరమ వంటి వ్యక్తి నిజంగా ఉందేమో, తెలుసుకోవాలనే మీ వద్దకు వచ్చాను'' అన్నాను. ఈ మాటలు అన్నాక నాకు కొంచెం సిగ్గు వేసింది. అనవసరమైన ఆవేశం ప్రకటించానేమో ? అని భయం వేసింది. ఏమైనా, విషయం బైటపెట్టేశాక ఏం జరిగినా సిద్ధంగా ఉండాలనుకుంటూ, జవాబు కోసం ఎదురుచూశాను.

ఆయన కొద్ది నిముషాలు నావైపు చూశారు. నా కళ్లలోనూ, నా మొహంలోనూ, నా భావాల్ని పూర్తిగా చదవగల్గుతూ, మనోరమయందు నాకు గల అభిమానాన్ని గ్రహించారేమో ననిపించింది, ఆయన అలా చూస్తుంటే.

కొద్దిసే పయ్యాక ఆయన కొత్త సిగరెట్టు ముట్టించారు. ''మనోరమ అంటే మీలాగే, నాకూ చాలా యిష్టం'' అన్నా రాయన గంభీరంగా.

నాకు కొద్దిగా ధైర్యం వచ్చింది. ''నిజంగా అంత అద్భుతమైన పాత్ర నే నెక్కడా చూడలేదు. మీ రటువంటి

వ్యక్తిని చూచి, ఆ పాత్ర చిత్రించి ఉంటారని, ఆమెలోని అందం, మంచితనం, సహృదయతా మిమ్మల్నెంతో ఆకర్షించి ఉంటాయనీ ఊహించాను. అసలు ఆ వ్యక్తి సజీవంగా ఉంటే ఒక్కసారి చూడాలని ఉంది'' అన్నాను.

లాయరుగారు, '' మీరొక రచయిత కావల్సింది'' అన్నారు నన్ను. ముగ్గురం నవ్వాం.

సత్యశీగారు ''మీ ఆతృత నేను గ్రహించగలను. నేనూ అలాగే బాధపడ్డాను. ఆ పాత్రకు సంబంధించిన ఒక సంఘటన చెప్తాను వినండి'' అని ప్రారంభించారు. నేనూ, లాయరుగారూ చెవులు రిక్కించి వినసాగాం.

''అసలు నా చిన్నతనంనుండి నేను చాలా కష్టాలలో, ఒంటరిగా పెరగడంవల్ల, నాకు ఇతరుల సానుభూతీ, ప్రేమా కరువైయాయి. నేను నా తలిదండ్రుల్ని నా మూడోయేట పోగొట్టుకున్నాను. మా తాతగారింట్లో నేను పెరిగాను. నేను అనాథుడ నవటంవల్ల, మా మామా, అత్తా నన్ను చాలా నీచంగా చూసేవారు ఇంట్లో. వారి పిల్లలకు మంచి బట్టలూ, శుభ్రమైన భోజనం ఉండేవి. కానీ, నా కెప్పుడూ చిరిగిన గుడ్డలూ, చద్దన్నమేను. అలాగే మొండిగా పెరిగి, స్కూలుకు వెళ్తుండేవాణ్ణి—సుమారు ఎనిమిది సంవత్సరాల వయసులో, నాకొక స్నేహితు డుండేవాడు. వాడికి, వాళ్ల పిన్ని ఎంతో సేపు ముస్తాబుచేసి పంపేది. ఆమెకు ఇరవైయేళ్ల లోపు వయస్సు ఉంటుంది. తెల్లటి చీరలు కట్టుకునేది. ఆమెన్ను నేను చూసినప్పుడల్లా, జడ వేసుకోకుండా విరబోసిన తల వెంట్రుకలతో, కాటుక కళ్లతో కన్పించేది. నా స్నేహితుడి పేరు గోపి. నేను చాలా కాలం వరకూ, ఆమె గోపీకి తల్లయి ఉంటుందనీ, ఊరికే ఆమెను 'పిన్ని' అని పిలుస్తున్నాడని అనుకునేవాణ్ణి. కాని, ఒకనాడు గోపి చెప్పాడు, తన తలి చిన్నతనంలో చనిపోయిందనీ, వాళ్ల నాన్న పిన్నిని పెళ్లి చేసుకున్నాడని. అప్పుడు నాకు అనిపించింది, మా అమ్మ కూడా చనిపోయింది కదా, నాకు అటువంటి పిన్ని ఉంటే ఎంతో బాగుణ్ణని ! కానీ, నాన్న లేకుండా పిన్ని రాదని అప్పు డంతగా తట్టలేదు. అసలు నాకు పిన్నిమీద ఎందుకు కోరిక కల్గిందంటే, గోపీ వాళ్ల పిన్ని, వాణ్ణి ఎంతో ప్రేమగా చూసేది. వాణ్ణి బతిమాలి బిస్కట్లూ అవీ తినిపించేది. ఇక నా పరిస్థితి ఎలాటిదంటే, నేను బతిమాలినా నాకు బిస్కట్లిచ్చేవా రెవరూ లేరు. పైగా ఆమె శ్రద్ధగా గోపీకి బట్టలూ, జోళ్లూ వేసి, తల దువ్వి పుస్తకాల సంచీ చేతికిచ్చి, బడికి పంపిస్తూంటే, నా మనస్సు కూడా నన్నెవరైనా అలా చేర దీస్తే బాగుండునని కోరేది. గోపీ పిన్ని, నన్ను కూడా ఎంతో ప్రేమగానే పలకరించేది. ఆమె ఎంతో మంచిదని నా విశ్వాసం. గోపీ వాళ్ల నాన్న కూడా ఎంతో మంచివాడయి ఉండాలనిపించేది. అప్పుడప్పుడు ఆయనను చూద్దామని కోరిక కల్గుతూండేది, నాకు. ఆయన ఇంకా అందంగా, మంచిగా ఉంటాడనిపించింది.

''ఒకనాడు నేనూ, గోపీ, మరికొందరు పిల్లలూ వాళ్లింట్లో ఆడుకుంటూంటే, గోపీ పిన్నికి ఫిట్సు వచ్చింది. ఆమె నేలమీద హఠాత్తుగా పడిపోయింది. తల ఊరికే బాదుకోసాగింది. పిడికిళ్లు బిగించింది. ఆ దృశ్యం చూసేసరికి నేను హడలిపోయాను. కాని గోపి అంతగా భయపడలేదు, ఇంట్లోకి పరుగెత్తి ఒక తాళంచెవి తెచ్చి, ఆమె పిడికిలిలో పెట్టాడు. కొద్దిసేపట్లో ఆమె తల బాదుకోవడం తగ్గింది. మెల్లిగా ఏడ్చింది కాసేపు. క్రమంగా తేరుకుంది. అదే సమయంలో వాళ్ల ఇంటిముందర ఒక జట్కా ఆగింది. అందులోంచి దిగింది గోపీ నాన్న అని తెలిసింది. లావుగా, పొట్టిగా ఉన్నా డాయన. తలమీద కొద్ది తెల్ల వెంట్రుక లున్నాయి. ఎందుకో ఆయనను చూస్తే నాకు జుగుప్స కలిగింది. ఆయనకు ఏభై ఏళ్లకు తక్కువ ఉండవు. గోపీ పిన్నికీ, ఆయనకూ ఎంతో తేడా ఉంది. ఆయన రాగానే మేమంతా బయటికి వచ్చి మా యిళ్లకు వెళ్లిపోయాం. తరువాత చాలాకాలం వరకూ నా మనస్సులో గోపీ పిన్ని గురించి బాధగా ఉండేది. గోపీ వాళ్ల నాన్న ఆమెను బాధిస్తున్నాడేమో ? అందువల్లనే ఆమె కా రోగం వచ్చిందేమో ? ననిపించేది.

''నాకు పదేళ్లు దాటాక నేను తాతగారింట్లో ఉండలేకపోయాను. మా పిన్ని తన దగ్గర ఉంచుకుంటానని వాళ్ల ఊరు తీసుకెళ్లింది. ఆమెవద్ద నాకు కావలసిన ప్రేమాభిమానాలు లభిస్తాయేమో నని చూశాను. కాని, ఆమె నన్నొక అనాథునిలాగే చూసేది. గోపీ పిన్నికీ, మా పిన్నికీ ఎంతో తేడా కన్పించింది. రెండేళ్లు అక్కడ ఉన్నాక, బంధువు లెవరైనా నన్ను ఒక్కలాగే చూస్తారని గ్రహించాను. ఒకనాడు వాళ్లింట్లోంచి పారిపోయాను—విశాల ప్రపంచంలో విహరిద్దామనే కోర్కెతో. అలా పారిపోయి చాలా ఊళ్లు తిరిగాను. ఆరోజుల్లోనే, స్వతంత్రంగా బ్రతకటం అలవాటయింది. ప్రతి ఊరిలోనూ కొన్ని నెల లుండడం, ఏదో చిన్న చిన్న పనులు చేసి పొట్ట పోషించుకోవడం, మళ్లీ మనస్సు మారిపోగానే, ఆ ఊరినుంచి మరో ఊరు వెళ్లిపోవడం, ఇలా ఎనిమిదేళ్ల కాలం గడిచింది. ఈ తిరగడానికి కారణ మేమిటో నేనే చెప్పలేను. ఏదో అన్వేషణ, నా హృదయంలో ఎవరినో కలుసుకోవాలని, ఎవరినో సంపాదించుకోవాలని, ఆ వ్యక్తికోసం అన్వేషణ ! గోపీ

పిన్ని రూపం అలా కన్పిస్తుండేది. వయస్సు వచ్చి కొత్త విషయాలు నేర్చుకున్నకొద్దీ, కొన్ని సంగతులు నా మనస్సులో మెదలుతూండేవి. గోపీ పిన్ని చాలా అందమైనది. మళ్లీ అటువంటి అందమైన స్త్రీ నాకు కన్పించలేదు. ఆమె వయస్సులో చిన్నది కావటంవలన, ముసలి భర్త ఆమెను సుఖపెట్టలేక పోతున్నాడేమో ననిపించేది. ఆమెకు తిండీ, బట్టా సమకూర్చవచ్చు ఆయన, కాని ఆమె వాంఛలు తీర్చగలడా ? శారీరకంగా వాంఛలు తీరకపోతే యవ్వనంలో ఉన్న స్త్రీకి గాని, పురుషుడికి గాని హిస్టీరియా వస్తుందంటారు. ఆమెకు దారుణమైన అన్యాయం జరిగిందని ఆమెను తల్చుకునప్పుడల్లా పరితపించేది నా హృదయం. అటువంటి స్త్రీ ఎక్కడైనా కన్పిస్తుందేమో, ఆమెకు నా సానుభూతి తెలియచెయ్యడం ద్వారా తృప్తి పొందగలనేమో ! నని ఆశించేవాణ్ణి !

‘‘కాని, అనుకోకుండా హఠాత్తుగా ఒకరోజున ఒక యింట్లో అచ్చు అలాటి స్త్రీయే కన్పించింది. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. నా కప్పటికి ఇరవయ్యో యేడు నడుస్తోంది. అప్పుడు నేను చేసే వ్యాపారం పత్రికలూ, పుస్తకాలూ అమ్మడం. ఆ ఊరు నేను వెళ్లి రెండు నెలలైంది. ఒక పుస్తకాలషాపు యజమాని వద్ద ఆ ఉద్యోగం సంపాదించాను. నేను చేసిన అన్ని ఉద్యోగాల కన్నా, పుస్తకాలూ, పత్రికలూ అమ్మడం అంటే నాకు చాల సరదా. ఎందుకంటే, ఆ ఉద్యోగంలో పుస్తకాలూ, పత్రికలూ చదువుకోడానికి గల అవకాశమే నన్నాకర్షించేది. ఆ రోజుల్లో వెర్రిగా చదివేవాణ్ణి. నే చదివిన కథల్లోగాని, నవలల్లో గాని, గోపీ పిన్నంత అందమైన స్త్రీ గాని, అంత మంచితనం కలిగి, అంత దారుణం జరిగిన స్త్రీ గాని నాకు కన్పించలేదు. అనేక కథల్లో అనేక రకాల బాధలు పడ్డ స్త్రీ లున్నారు. వాళ్లందరూ ఒక ఎత్తు, నా మనస్సులో ఉన్న గోపీ పిన్ని ఒక ఎత్తు. అటువంటిది, నేను పత్రికలమ్ముతూ ఒక యింటికి వెళ్తే ఆ యింట్లో ఆమె కన్పించింది. నేను హాలు కిటికీవద్ద నిలబడి ‘పత్రికలు కావాలా?’ అని అడిగాను. కుర్చీమీద కూర్చుని, ఎటో మొహం పెట్టుకున్న ఆమె చటుక్కున నావైపు తిరిగింది. ఆ కళ్లను చూసేసరికి నా శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లయింది. వాటిలో ఎంత ఆకర్షణో, ఎంత అమాయకతో, ఎంత మంచితనమో, చెప్పలేను. ఆమె వయస్సు 20 లోపు ఉంటుంది. చాలా అందంగా ఉంది. అచ్చు గోపీ పిన్నిలాటి రూపమే ఆమెది. నా మనస్సు సంతోషంతో పొంగిపోయింది. నా హృదయం ఎంతో వేగంతో కొట్టుకుంది. ‘పత్రికలా ? ఏవీ చూస్తాను’ అని లేచి వచ్చింది. నా దగ్గరున్న పత్రికలన్నీ చూసి ఒక వారపత్రిక తీసుకుంది. నేను ఆమెవైపు వెర్రిగా చూస్తున్నానని నాకు తెలియకుండానే చూశాను. ఆమె ఒక్క నిముషం నావైపు చూసి లోపలికి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోయాక నాకు తెలివి వచ్చింది. ఆమె ఏమనుకుందో ? అని భయం వేసింది. ఒక నౌకరు కుర్రాడు వచ్చి డబ్బు లిచ్చాడు. నాకు డబ్బులు తీసుకోవా లనిపించలేదు. వద్దన్నాను. నా మనస్సు ఎంత హాయిగా, ఆనందంగా ఉందంటే, నాకు డబ్బులు తీసుకోడం తప్పులా కన్పించింది. నౌకరు లోపలికి వెళ్లిపోయాడు. కొద్దిసేపు ఆమె మళ్లీ హాలులోకి వస్తుందేమోనని చూశాను. హాలులో ఒక స్త్రీ పటం కన్పించింది. వికారమైన మొహం, ఎత్తుపళ్ళూ, నల్లగా, లావుగా ఉండి, సుమారు నలభై ఏళ్ల వయస్సున్న స్త్రీ రూపం అందులో ఉంది. ఎక్కువసేపు ఆ పటంవైపు చూస్తే, ఆ వికారం నన్ను వెంట తరుముతుందేమో నని భయం వేసింది. కొద్దిసేపు చూశాక, ఆమె తిరిగి రాదని నిశ్చయించుకుని వచ్చేశాను. ఆరోజు నుంచీ ప్రతిరోజూ ఒకసారి ఆ వీథివెంట వెళ్తూండేవాణ్ణి, ఆమె కన్పిస్తుందేమోననే ఆశతో.

‘‘ఆమెను ఒకసారి చూసిన దగ్గర్నుంచి నాలో ఏవో ఊహలు చెలరేగాయి. ఆమెతో స్నేహం చేసుకోవాలనీ, మాట్లాడాలనీ ఉండేది. ప్రతి వారం విధిగా వెళ్లి వారపత్రిక ఇచ్చి వస్తుండేవాణ్ణి కాని తరువాత మళ్లీ ఆమె కన్పించలేదు. నా మనసులోని ఆరాటాన్ని ఎవరితోనైనా చెప్పుకోవాలనిపించేది. ఆమెకు సాహిత్యమంటే ఇష్టం కాబోలు. పత్రికలు బహుశా చాలకాలంనుంచి కొంటూ ఉండి ఉండవచ్చు. ఆ రోజుల్లో నాకొక స్నేహితు డుండేవాడు. అతని కొక కిళ్లీకొట్టుంది. సుమారు రెండేళ్ల క్రితం అతను కూడా ఇంటింటికీ వెళ్లి పత్రికలూ, పుస్తకాలూ అమ్ముతూండేవాడు. తరువాత కిళ్లీ కొట్టు పెట్టుకుని, ఆ అమ్మకం మానేశాడు. అతనితో ఒక నాడు యాదాలాపనగా మాట్లాడుతూ, ఫలానా వీథిలో, ఫలానా ఇంట్లో పత్రికలు అమ్ముతూండేవాడివా ? అని ప్రశ్నించాను. దాని కతడు, ‘ఓ. ఆవిడకు పుస్తకాలంటే మహా పిచ్చి. ఆవిడ చాలా మంచిదని అందరూ అంటారు. ఆమెని పొగడని వాళ్లు లేరు. కాని, పాపం, ఆవిడ భర్త మంచివాడు కాడు. ఎప్పుడూ ఆమెను హింసించేవాడని వినికిడి .... ’ అని ఇంకా ఏంచెప్పాడో నాకు విన్పించలేదు. నాకు కావలసిన వ్యక్తి లభించింది. సరిగ్గా గోపీ పిన్నిలాటి వ్యక్తినే చూశాను. ఆ అందం, ఆ మంచితనం, ఆ అన్యాయాన్ని భరించి సహిస్తున్న కళ్ళూ మళ్లీ చూశాను.

‘‘అప్పటినుంచి నా భావనలో ఆ వ్యక్తి ఇరవైనాలుగు గంటలూ మెసిలేది. ఆమెను ప్రత్యక్షంగా చూడకపోయినా ఆమె రూపం, ఆమె మంచితనం, ఓర్పూ, అవన్నీ స్పష్టంగా

నా కళ్లముందర కదలాడుతుండేవి. ఒక్కణ్ణీ కూర్చుని, ఆమెతో మాట్లాడుతున్నట్లూ, ఆమె అందాన్ని ఆరాధిస్తున్నట్లూ, ఆమెయందు సానుభూతిని చూపిస్తున్నట్లూ ఊహించుకునే వాణ్ణి. ఆమె మంచితనం తల్చుకుని కన్నీరు కార్చేవాణ్ణి. ఆ అందం, అలా దుర్మార్గుడైన భర్త చేతిలో నలిగిపోవడం నాకు చాలా కష్టం కలిగించింది. ఏమైనా సరే, ఆమెకు నా సానుభూతి తెలియజెయ్యాల్సిందే ననుకున్నాను. నా శక్తినంతా ఉపయోగించి ఆమెకు జరుగుతున్న అన్యాయం నెదుర్కోవాలి. గోపీ పిన్నిని తిరిగి కలుసుకోలేను. కాని, ఈమెతో నా పరిచయం వృద్ధిచేసుకోవా లనుకున్నాను. ఆమెకు పుస్తకాలంటే చాలా ఇష్టం అని నా స్నేహితుడు చెప్పాడు. అందువల్ల వీలైనన్ని పుస్తకాలు తీసికెళ్లి ఆమె కివ్వాలని నిశ్చయించాను. పుస్తకాల ద్వారా ఆమె పరిచయం సంపాదించచ్చు. తరువాత క్రమముగా మా యిద్దరి మధ్యా స్నేహం పెరుగుతుంది. అప్పుడామె హృదయాన్ని నావైపు తిప్పుకొని, నా సానుభూతినామె స్వీకరించేట్టు చెయ్యచ్చు. నాకు కావలసిన దంతేను.

"ఆ వారం పత్రికలతోబాటు, ఎన్నో మంచి పుస్తకాలు తీసుకుని ఉత్సాహంతో ఆమె ఇంటికి బయల్దేరాను. వాళ్ల ఇంటి తలుపు వేసిఉంటే గట్టిగా బాదాను. ఒక నౌకరు వచ్చి తలుపు తీశాడు. వాడు కొద్దిగా ముసలాడు., నెమ్మదస్తుడి లాగా కన్పించాడు. నెరిసిన తలా, ముడతలుపడ్డ మొహం, అతనికి కొద్దిగా చిన్న వయస్సులోనే సంప్రాప్తించినట్టున్నాయి. "ఏం కావాలి ?" అని అడిగాడు. పుస్తకాలూ, పత్రికా చూపించి అమ్మగారి కవి ఇవ్వాలనీ, ఆమె కావాలనీ అడిగాను. అమ్మగారింటో లేదనీ, బజారు కెళ్లిందనీ చెప్పాడు. 'అయినా ఆవిడగారి కెందుకీ పుస్తకాలు ? చదవడం వస్తేగా ?' అన్నాడు.

"వాడి అమాయకతకు నాకు ఆశ్చర్యం వేసింది. "ఆమెకు ఈ పుస్తకాలంటే చాలా యిష్టం" అన్నాను. వాడు తెల్లబోతూ 'అబ్బే! ఆమె కసలు తెలుగు చదవడమే రాదు' అన్నాడు. అప్పుడు నేను, వాడు పొరబడుతున్నాడనీ, ఆమె మునుపు ఎన్నో పుస్తకాలు కొందనీ, నా దగ్గర వారపత్రిక కొందనీ చెప్పాను. దానికి కొంచెం ఆలోచించి, 'ఆ అమ్మగారు వేరు. ఆమె మా బాబుగారి మొదటి భార్య. మహా దొడ్డ యిల్లాలు. ఈవిడ రెండోభార్య. ఈమెదీ దేశం కాదు. తెలుగు కొంచెం మాట్లాడ్డం నేర్చుకుంది, గాని, చదవడం రాదు. మా బాబుగారు ఆవిడని మలబారు నుంచి తీసుకొచ్చారు' అన్నాడు. నౌకరు కాస్త సంస్కారం కల వ్యక్తిలా కన్పించాడు. పైగా కొద్దిగా బాతాఖానీ అలవా టున్నట్లుంది. అందుకని మెల్లిగా ఆమె విషయం మళ్లీ కదిపాను. 'పాపం వయసులో చిన్నావిడలాగుంది. బాబుగారు సరిగా చూస్తారా ?' అని అడిగాను.

"దానికి, 'ఓ ! ఆవిడెంత చెప్తే అంత ఆయనకు. ఆ మొదటి భార్యనే నానా కష్టాలు పెట్టారు. ఆ మహాతల్లి చనిపోయేదాకా అలాగే ఓర్పుతో భరించింది. ఇహ ఈవిడ వచ్చిన దగ్గర్నుంచీ, మా ప్రాణాలు తీసేస్తోంది. ఇంత గయ్యాళిని నే నెక్కడా చూడలేదు. మా అయ్యగారి కోపం అంతా ఏమైపోయిందో ఈవిడ ముందర పిల్లిలా ఉంటారు. ఆ భార్యను అంత కష్టపెట్టినాయన, ఈవిడను నెత్తిమీద పెట్టుకు పూజిస్తారు.' అన్నాడు. నాకు కొద్దిగా చెమట పోసింది. ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది. మెల్లిగా, 'అయితే ఈమె పైకి కన్పించినంత మంచావిడ కాదా ?' అన్నాను. అతను తలూపుతూ 'అబ్బే ! నట్టి నీతి, జాతి లేని మనిషి. మమ్మల్ని చూసి కళ్లల్లో నిప్పులోసుకుంటుంది. ఎక్కడో నీచపు వృత్తిలో బ్రతికిన మనిషిలాగుంది' అన్నాడు. తన మనస్సులోని అక్కస్సుని వెళ్లగక్కుతూ. 'అయితే మీ పాత అమ్మగా రెలా ఉంటారు ?' అని అడిగాను. హాలులో ఉన్న ఫోటో చూపించాడు. 'ఆమె మా పాతమ్మగారు. మనసు వెన్నలాటిది. పుస్తకాలూ, పత్రికలూ తెగ కొనేది. ఈవిడ కూడా అప్పుడప్పుడు ఆ పత్రికలలోని బొమ్మలు చింపి దాస్తుంది. కానీ ఆవిడకూ ఈవిడకూ సహస్రాంతం .... '. ఇక వినలేకపోయాను. ఎదురుగా ఫోటోలోని వికారం నన్ను తరుముగా బయటికి పారిపోయాను.

"అప్పటినుంచీ నే నటువైపు వెళ్లలేదు. వాస్తవం నన్ను మోసం చేశాక నా కల్పనే నాకు మిగిలింది. నా మనసులో నేను సృష్టించుకున్న వ్యక్తి, నన్ను ఇరవైనాలుగు గంటలూ వెంటాడసాగింది. నిజంగా అటువంటి వ్యక్తిని చూడాలని నాకు తహతహగా ఉండేది. కాని ఆమె నాకు లభ్యమౌతుం దనే ఆశ లేదు. నా ఊహల్లోని స్త్రీ క్రమంగా, నా కలంలో జీవం పుంజుకుని, నా నవలలో పాత్రగా పరిణమించింది. 'కరుణ' నవల వ్రాసి, ఆమెను నా భావనా ప్రపంచంలో సృష్టించుకొన్నాక గాని నాకు మనశ్శాంతి కలుగలేదు. మనస్సులోని తృష్ణకు, కల్పనవల్ల లభించిన శాంతే మనోరమ."

అని ముగించారు సత్యశ్రీగారు.

---